క్లుప్తంగా

'అభి' చైర్మన్‌కు సేవారత్న పురస్కారం



అవార్డును అందుకుంటున్న విజయ్ బాబు

కమలాపురం : కమలాపురంలోని అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ బాబుకు జాతీయ సేవారత్న పురస్కారం లభించింది. ఆదివారం గుంటూరులో కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అఖిలభారత ఎన్‌జీఓస్ సంక్షేమ సంఘం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమాజ సేవకులకు జాతీయ సేవారత్న పురస్కారం అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా విజయ్‌బాబు ఈ అవార్డు అందుకున్నారు.

విద్యుత్ పోరాట మృత వీరులకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : నాడు టీడీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో అమరులైన ఉద్యమకారులకు సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఉద్యమ వీరులు మరణించి 23 సంవత్సరాలు కావడంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు శివనారాయణ మాట్లాడుతూ నాడు ప్రజల కోసం ఉద్యమించి రామకృష్ణ, విష్ణువర్దన్‌రెడ్డి బాలస్వామిలు ప్రాణాలను అర్పించారన్నారు.

గృహసారథులకు బీమా నమోదు



బీమా నమోదు చేస్తున్న కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల సచివాలయ కన్వీనర్లు, జగనన్న గృహసారథులకు లైఫ్‌టైం రూ.10లక్షల బీమా కల్పించారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ప్రశాంత్‌నగర్ సచివాలయంలో జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, సచివాలయం కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న గృహ సారథుల బీమా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరమన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అతిథి భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న బ్రహ్మానందరెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండల పరిధిలోని బిదినెంచెర్ల గ్రామంలో మండల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జెడ్పీటీసీ రూన్సీరాణి, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బ్రహ్మానందరెడ్డి దంపతులు ఎంపీ అవినాష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థులతో పాటు వైద్య సిబ్బంది, రోగులకు కూడా అతిథి భోజనం ఏర్పాటు చేశారు.

గంగమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కింపు చేస్తున్న ఆలయ సిబ్బంది

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్త పేట సమీపంలోని గంగమ్మ తల్లి దేవస్థానానికి సంబంధించి హుండీ లెక్కింపు నిర్వహించారు. సోమవారం ఆలయ ఆవరణంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించగా 40 రోజులకు లక్షా ఆరువేల 582 రూపాయల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ పి. సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని డీఆర్‌డీఏ అదనపు పథక సంచాలకులు ప్రసాద్ తెలిపారు. సోమవారం న్యాయవాది అజయ్‌కుమార్ వీణా జయంతిని పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అజయ్ యువ సేన నాయకులు వీణా సాయి కౌశిక్, బ్లడ్ టూ లీవ్ ప్రతినిధి పవన్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాకారం

- అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఓఎస్‌డీ, వైఎస్ మధురెడ్డిలు

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి పేర్కొన్నారు. మండలంలోని వేల్పుల గ్రామంలో సోమవారం సచివాలయ సముదాయ ప్రథమ వార్షికోత్సవాలను ప్రారంభించి జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సచివాలయాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వేల్పులలోని సచివాలయ భవన సముదాయాన్ని ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి 4లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామాల్లో వలంటీర్ల సేవలు అద్భుతంగా ఉన్నాయని, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఉన్నత చదువులకు దూరమైన ఎంతో మంది పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలతో నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువులు దగ్గర చేశారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి ఇంగ్లీషు విద్యను ప్రవేశపెట్టడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు ఇంగ్లీషు మీడియం చదువుతున్నారన్నారు. ఇలాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, సొసైటీ అధ్యక్షుడు మాధవ రెడ్డి, ఎంపీటీసీ బాబ్‌జాన్, సర్పంచ్ నిర్మల, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

క్రీడాసంబరాలతో పండుగ వాతావరణం

సచివాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఆటల పోటీలతో పండుగ వాతావరణం నెలకొంది. పులివెందుల ఓఎస్‌డీ అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వైఎస్ మధురెడ్డిలు టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయి సచివాలయ సిబ్బందికి కబడ్డీ, వాలీబాల్, వంద మీటర్ల పరుగు పందెం, త్రోబాల్, మహిళలకు టెన్నీస్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విజేతలు వీరే

కబడ్డీ మహిళల విభాగంలో వేముల విన్నర్‌గా, వేంపల్లె రన్నర్‌గా నిలిచింది. అలాగే టెన్నికాయిట్ మహిళల విభాగంలో వేంపల్లె విన్నర్, చక్రాయపేట రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ పురుషుల విభాగంలో సింహాద్రిపురం విన్నర్‌గా, వేంపల్లె రన్నర్‌గా నిలిచింది. పురుషుల షాట్‌పుట్ విభాగంలో సింహాద్రిపురం మండలానికి చెందిన జి.బాబు విన్నర్‌గా, వేములకు చెందిన విజయ్, వెంకటేశ్వర రెడ్డిలు రన్నర్‌గా నిలిచారు. 100 మీటర్ల పరుగుపందెంలో వేంపల్లెకు చెందిన శివశంకర్ ప్రథమస్థానంలో, వేంపల్లెకు చెందిన జి.గంగాధర్ ద్వితీయ స్థానం, చక్రాయపేటకు చెందిన ముబారక్ తృతీయ స్థానంలో నిలిచారు. మహిళల షాట్‌పుట్ విభాగంలో వేములకు చెందిన శ్రీదేవి ప్రథమ స్థానంలో, కె.హారిక ద్వితీయ స్థానం, రామకుమారి తృతీయ స్థానంలో నిలిచారు. 100 మీటర్ల విభాగంలో మొదటి స్థానం లింగాలకు చెందిన మాధవీలత, ద్వితీయ స్థానం వేంపల్లెకు చెందిన చంద్రమౌనిక, తృతీయ స్థానంలో వేములకు చెందిన శ్రీదేవి, నారాయణమ్మలు నిలిచారు.

నేడు నందిమండలంలో గడప గడపకు మన ప్రభుత్వం

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామ సచివాలయం-1 పరిధిలో మంగళవారం మధ్యాహ్నం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజుల రెడ్డిలు పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని మొల్లమాంబ సమావేశ మందిరంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమానికి వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య టి. రామ ప్రసాద్‌రెడ్డి, ప్రముఖ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

సంక్షేమ నిధికి ఎంపీ రూ.5లక్షలు వితరణ



నగదును అందజేస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి, వరప్రసాద్

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రెస్‌క్లబ్ సంక్షేమ సహాయ నిధికి కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రూ.5లక్షలు వితరణగా అందజేశారు. ఈ నెల 17న నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్ కుమార్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ సంక్షేమ నిధికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కోరారు. ఇందుకు ఆయన స్పందించి పది రోజుల్లోనే రూ.5లక్షలను మంజూరు చేశారు. సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డిలు రూ.5లక్షల నగదును ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు మారుతిప్రసాద్, వివేక్, ప్రధాన కార్యదర్శి రమేష్, రమణారెడ్డి, శేషారెడ్డిలకు అందజేశారు. వైఎస్సార్ ప్రెస్ క్లబ్ సంక్షేమ నిధికి అడిగిన వెంటనే రూ.5లక్షలు మంజూరు చేసిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి పాత్రికేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



నాకాబందీలో పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ నాగరాజు

ఎర్రగుంట్ల : ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు అన్నారు. సోమవారం తెల్లవారుజామున మాలెపాడు గ్రామంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లు, కల్లాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పోలీసు అధికారుల సూచనల మేరకు క్రమశిక్షణగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ముద్దనూరు, కొండాపురం సీఐలు, కలమల్ల, ముద్దనూరు, కొండాపురం, యర్రగుంట్ల ఎస్ఐలతో పాటు 50 మంది సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



నగర కమిషనర్ రాజశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాసులు, విజయ్ కుమార్

కమలాపురం : కమలాపురం క్రాస్ రోడ్డు నుంచి గ్రామ చావిడి వరకు మధ్యలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మన ఊరు సేవా సమితి అధ్యక్షుడు శ్రీలం శ్రీనివాసులు, మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ కుమార్ కోరారు. సోమవారం వారు మండల తహసీల్దార్ సరస్వతి, ఎస్ఐ చిన్నపెద్దయ్య, కమిషనర్ రాజశేఖర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన చోదకులు విపరీతమైన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుధాకర్ రెడ్డి

చింతకొమ్మదిన్నె : విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించాలని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడానికి డిప్లొమా కోర్సు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మురళీ మోహన్ నాయక్, కె.యస్.శశి కుమార్, శ్రీ చందన, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధునిక వ్యవసాయంపై శిక్షణ

వీరపునాయునిపల్లె : మండలంలోని రైతులకు ఆధునిక వ్యవసాయంపై మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి కల్యాణి తెలిపారు. ఈ శిక్షణా తరగతులు మంగళవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31న వాహనాల వేలంపాట

పులివెందుల రూరల్ : పులివెందుల స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 31న వేలం పాట నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంపాటలో వాహనాలు దక్కించుకున్న వ్యక్తి వేలం పాట డబ్బులతో పాటు జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెబ్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పిల్లలను బాగా చదివించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పిల్లలను బాగా చదివించాలని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ సూచించారు. సోమవారం 48వ డివిజన్ బుడగజంగం కాలనీలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో బుడగజంగాల మహిళలు చెత్త కాగితాల ఏరివేత పేరుతో నగర వీధుల్లో సంచరిస్తున్నారని, అర్ధరాత్రి సమయంలో చెత్త కాగితాల పేరుతో బయట తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తగిన చర్యలు చేపట్టాల్సి వస్తుందన్నారు. పిల్లలను బిక్షాటనకు పంపించకుండా బడికి పంపాలన్నారు. ఇకనైన చట్టప్రకారం నడుస్తూ దొంగతనాలు మాని జీవితాన్ని మార్చుకోవాలన్నారు. అలాగే పిల్లలకు చిన్న వయస్సుల్లోనే వివాహాలు చేయకుండా వారిని బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పాత రిమ్స్ లో ఉన్న జిల్లా కార్మిక ఉప కమిషనర్ కార్యాలయం దగ్గర భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలోను ప్రభుత్వ స్కీము పథకాలతో పాటు, కార్మిక సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు ఐదు వేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు కెసీ బాదుల్లా, మద్దిలేటి శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యతో సమాజాభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అధికారులు

వేంపల్లె : విద్యతో సమాజాభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డిలు పేర్కొన్నారు. జేవీ వినోద్ కుమార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బిస్మిల్లా మదరసా విద్యార్థులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ, తహసీల్దార్, వేంపల్లె సర్పంచ్ ఆర్. శ్రీనివాసులు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా మదరసాలోని 60 మంది పేద అనాథ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు సేవా సంస్థలు కూడా పనిచేస్తే సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు అవుతుందన్నారు. మానవ వికాసానికి విద్య ఒక పునాది అని, ప్రమాణాలతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మానవతా విలువలతో కూడిన మెరుగైన విద్యను విద్యార్థులు అభ్యసించి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. జేవీ ట్రస్టు నిర్వాహకుడు బాలస్వామి, మదరస వ్యవస్థాపకుడు, మాజీ జెడ్పీటీసీ షబ్బీర్ వలి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అల్‌అమీన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగన్న, ఆదినారాయణ రెడ్డి, మదరస ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మురికినీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణాన్ని చల్లుతున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు : ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలిలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు పేర్కొన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని బి.కోడూరు, ఐత్రంపేట, అయ్యవారిపల్లె, అమ్మవారిపేట, మేకవారిపల్లె, తుమ్మలపల్లె, ప్రభలవీడు, పాయకులంట్ల, పెద్దుళ్లపల్లె గ్రామాల్లో అపరిశుభ్ర ప్రదేశాలు, మురికినీరు నిల్వ ఉన్న గుంతల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది, సీహెచ్ఓలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి నాగమణి, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస రెడ్డి, పబ్లిక్ హెల్త్ నర్స్ పుష్పాంజలి, ఆరోగ్య పర్యవేక్షకులు జాన్‌విలియం, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ప్రతినిధులు

జమ్మలమడుగు : పట్టణంలోని నాగులకట్ట వీధికి చెందిన గంజిగుంట చౌడప్ప(70) అనే వృద్ధుడు మరణించగా మే ఐ హెల్ప్‌యూ సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికులు, బంధువులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో పోలీసులు మే ఐ హెల్ప్‌యూ సంస్థ ప్రతినిధులైన లక్ష్మన్‌మోరేకి సమాచారం ఇచ్చారు. వారు సంస్థ ప్రతినిధులతో కలసి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమన్‌బాబు, అశోక్ కుమార్, భార్గవ్ సాయి, అల్తాఫ్, భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో వేగవంతం చేయాలి



షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : షాపింగ్ కాంప్లెక్స్ పనులు వేగవంతం కావాలని.. వాటిని నాణ్యతగా నిర్మించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాతమార్కెట్‌లో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ సురేంద్రనాథ్, మున్సిపల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసిరినందించే వేలాంగిణి మాత

నేటి నుంచి నవదిన ఉత్సవాలు



కడప కల్చరల్ : ఆ ప్రశాంతమైన వాతావరణంలోకి అడుగు పెట్టగానే మనసు ఎంతో తేలికపడుతుంది. బాధలన్నీ మాయమైనట్లు అనిపిస్తుంది. నిజమే ఆ ప్రాంగణంలో అడుగు పెడితే ఆరోగ్యాన్ని అందించే ఆ తల్లి ఒడిలో స్వాంతన పొందినట్లే! ఆమె పేరు ఆరోగ్యమాత. కడప నగరంలో ఆమె పేరిట ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం ఏర్పడింది.

కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల కడప వేలాంగణి ఆరోగ్యమాత ఉత్సవాలను మంగళవారం నుంచి సెప్టెంబరు 8వ తేది వరకు నిర్వహించనున్నారు. కడపజిల్లాలో క్రైస్తవం విస్తరించిన అనంతరం క్రిస్టియన్‌లేన్, రైల్వేస్టేషన్, మరియాపురం ప్రాంతాలలో క్రైస్తవ సంస్థలు ఆవిర్భవించాయి. ప్రస్తుతం ఆరోగ్యమాత చర్చి ఉన్న ప్రాంతం ఒకప్పుడు పెద్ద గోతులు, ముళ్ల కంపలతో నిండి ఉండేది. బళ్లారి, గుత్తి ప్రాంతాలలో క్రైస్తవ బోధనలు చేస్తున్న గురువులు ఈ ప్రాంతానికి వచ్చి రైల్వేస్టేషన్‌కు సమీపంలోని ప్రస్తుతం చర్చి ఉన్న స్థలంలో చిన్న కొట్టాన్ని నిర్మించి, అందులో ప్రార్థనలు చేసేవారు. తర్వాత ఆ స్థలాన్ని అభివృద్ధి చేసి చిన్న మందిరాన్ని నిర్మించారు. విశ్వాసుల సంఖ్య క్రమంగా పెరగడంతో దాని స్థానంలో చర్చిని నిర్మించారు.

1977 ప్రాంతంలో నాటి కడప పీఠాధిపతులు ఎస్‌ఏ అరుళయ్య ఆరోగ్యమాత పుణ్యక్షేత్రాన్ని పూర్తి స్థాయిలో తీర్చిదిద్దారు. పాత చర్చితోపాటు మరో చర్చి నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది.

2007లో నాటి గురువులు ఫాదర్ సగిలి ప్రకాశ్ నూతన చర్చి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. 2009లో కొత్త చర్చి పూర్తయింది. మోస్ట్ రెవెరెండ్ ×ఫెడ్రో లోపేజ్ క్వింటానా౯ చర్చిని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ చర్చికి డైరెక్టర్‌గా ఎండీ ఎం డీ ప్రసాద్, సహాయ డైరెక్టర్ విల్సన్ సేవలు అందిస్తున్నారు. యేటా ఈ క్షేత్రంలో ఆరోగ్యమాత పేరిట తిరునాల నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం నుంచి నవదిన ఉత్సవాలను సాయంత్రం 5 గంటలకు అదిలాబాద్‌కు చెందిన రెవెరెండ్ డాక్టర్ బిషప్ ప్రిన్స్ అంథోని దివ్య బలిపూజ అనంతరం పతాకావిష్కరణ చేసి ప్రారంభిస్తారు. ప్రతిరోజు సాయంత్రం 5.30 నుంచి 8.00 గంటల వరకు ప్రముఖ మత గురువులు ఆధ్యాత్మిక అంశాలపైన ఆరోగ్యమాత గురించి ప్రసంగించనున్నారు. సెప్టెంబరు 8న దివ్యమాత జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ప్రసాద్

పులివెందుల రూరల్ : వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించి రికార్డులను కలిగి ఉండాలన్నారు. దూరప్రాంతాలకు వెళ్లేటప్పుడు రికార్డులతో పాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు అధిక లోడ్ వేసుకొని పోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధిక లోడ్‌తో వెళ్తే కేసు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న గృహాలకు తప్పనిసరిగా ప్లాన్ అప్రూవల్ ఉండేలా చూడాలని, ఆక్రమణలు ఎక్కడా లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. నగరంలో ఏర్పాటు చేయు బ్యానర్లు, ఫ్లెక్సీలకు తప్పనిసరిగా చలానా కట్టించుకోవాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, మేనేజర్ హిదాయతుల్లా, ఎస్ఈ రత్నాల రాజు పాల్గొన్నారు.